క్లుప్తంగా

సెక్టోరియల్ అధికారులే కీలకం

– ఆర్డీఓ హరిప్రసాద్

మదనపల్లె : ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఆర్డీఓ హరిప్రసాద్ సూచించారు. గురువారం సబ్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల సెక్టోరియల్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆర్డీఓ హరిప్రసాద్ మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలు, రూట్‌లపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ అధికారులను డీఎస్పీ ప్రసాదరెడ్డి ఆదేశించారు. తహసీల్దార్ రమాదేవి, ఎన్నికల డీటీ అస్లాం, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్య పరిష్కారం

కలికిరి : మండలంలోని గుట్టపాళెం గ్రామంలో లో ఓల్టేజి సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతుల సమస్యను గమనించిన స్థానిక సర్పంచ్ ఆర్. వెంకటరెడ్డి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి,మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి పెద్దిరెడ్డి గుట్టపాళెం గ్రామానికి నూతన సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు చీకిరాల బర్నేపల్లి వద్ద స్థలం ఎంపిక చేయడంతో వెంకటరెడ్డి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ కన్‌స్ట్రక్షన్ ఏడీఈ రమేష్, ఏఈ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

'బి.కొత్తకోట'కు లక్షల్లో ఆదాయం

బి.కొత్తకోట : నగర పంచాయతీకి రూ.లక్షల్లో ఆదాయం సమకూరింది. పంచాయతీ పరిధిలో ఏడాదికి గుత్తలు అప్పగించేందుకు గురువారం కమిషనర్ పీఆర్.మనోహర్ వేలం పాటను నిర్వహించారు. ఈ పాటల్లో గత ఏడాదికి మించి ఆదాయం లభించింది. గుత్తలను దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. ఇందులో దినసరి కూరగాయల మార్కెట్‌కు రూ.1,64,610, వార పుసంతకు రూ.17,16,900, ప్రైవేటు బస్టాండ్‌కు రూ.3,15,650 పలికింది. 2023–24 ఏడాదికి నిర్వహించిన వేలం పాటల్లో మొత్తం రూ.21,97,160 ఆదాయం వచ్చిందని కమిషనర్ తెలిపారు.

నిమ్మనపల్లెకు రూ.12.06 లక్షల ఆదాయం

నిమ్మనపల్లె : బహిరంగ వేలం పాట ద్వారా నిమ్మనపల్లె పంచాయతీకి రూ.12.06 లక్షల రూపాయల ఆదాయం సమకూరినట్లు డీఎల్‌పీఓ నాగరాజు, ఈఓపీఆర్డీ చలపతిరావు తెలిపారు. గురువారం స్థానిక వారపు సంతలో సర్పంచ్ పాపులమ్మ మల్లప్ప, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు.కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి రాజేష్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పది'లో మంచి ఫలితాలు సాధించాలి

మదనపల్లె సిటీ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని కడప ఆర్జేడీ రాఘవరెడ్డి సూచించారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి విద్యార్థికి పదో తరగతి పునాది అన్నారు. పరీక్షలలో ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆయన సూచించారు.

జగనన్న ఇంటి పట్టాల పంపిణీ

రామసముద్రం : రామసముద్రం మండలం మూగవాడి పంచాయతీ కేంద్రంలోని గ్రామ సచివాలయంలో జగనన్న ఇంటి పట్టాలను సింగిల్‌విండో అధ్యక్షుడు కేశవరెడ్డి, సర్పంచ్ రత్నమ్మ, ఎంపీటీసీ శైలజ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్లు మంజూరు చేసి రిజిస్ట్రేషన్లు చేసి ఇవ్వడం సీఎం జగనన్నకే సాధ్యమన్నారు. ఉప సర్పంచ్ రాధారెడ్డి, స్థానిక నాయకులు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

బియ్యం వితరణ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని అంకిరెడ్డిపల్లి సమీపంలోని శ్రీ భైరవేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదానం చేసేందుకు బూర్లపల్లి సర్పంచ్ సుబ్బిరెడ్డి 20 ప్యాకెట్ల బియ్యం ప్యాకెట్లు అందజేశారు.

పేదలకు గూడు జగనన్న లక్ష్యం

- పండుగ వాతావరణంలో టిడ్కో ఇళ్ల గృహప్రవేశం
- 1,872 మంది లబ్ధిదారులకు ఇంటిపత్రాలు పంపిణీ


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నిసార్‌అహ్మద్, మనూజారెడ్డి తదితరులు

మదనపల్లె : ఇల్లు లేని పేదలందరికీ గూడు కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వం ముందుకెళుతోందని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ అన్నారు. నవరత్నాలు-పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా మున్సిపాలిటీలోని పేదలకు ఏపీ టిడ్కో-పీఎంఏవై(యు) పథకం కింద వైఎస్సార్ జగనన్న నగర్‌లో నిర్మించిన టిడ్కో ఇళ్లను గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. టిడ్కో గృహసముదాయాల ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, నూర్ ఆజం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ పేదల సొంతింటి కల నేటితో సాకారమైందన్నారు. మదనపల్లె మున్సిపల్ పరిధిలో 1,872 మంది లబ్ధిదారులకు ఇళ్లను అందించడం ఆనందంగా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్ల పేరుతో పేదలను చంద్రబాబు మోసం చేస్తే... ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కేవలం ఒక రూపాయితో రూ.7లక్షల విలువచేసే ఆస్తిని అక్కచెల్లెమ్మలకు అందించారని తెలిపారు. ప్రజలందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్ దీపా, ఈశ్వరయ్య, మార్కెట్‌కమిటీ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, జబ్బల శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరు రఫీ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఖాయం

నిమ్మనపల్లె : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం ఖాయమని నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. గురువారం నిమ్మనపల్లెలోని టీవీఆర్ కల్యాణ మండపంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు, ఎంపీపీ నరసింహులు, సింగల్ విండో అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కే సదాశివరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రూ.1.37 కోట్లతో క్రిమిటోరియం ప్రారంభం

పట్టణంలోని పెద్దతోపు హిందూ శ్మశానవాటికలో మున్సిపల్ బీపీఎస్ నిధులు రూ.1.37 కోట్లతో నిర్మించిన గ్యాస్ క్రిమిటోరియాన్ని నిసార్ అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు.అనంతరం మీడియాతో వారు మాట్లాడుతూ శ్మశానవాటికలో అంత్యక్రియలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు చేపట్టాలన్న ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో క్రిమిటోరియం నిర్మించారన్నారు.గతంలో హిందూ శ్మశానవాటికలో అభివృద్ధి పనులకు ఎంపీ మిథున్‌రెడ్డి రూ.6 లక్షలు ఎంపీ నిధులు కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డీఈ శ్రావణి, ఏఈ బండపల్లిశిరీషా, కౌన్సిలర్లు పాల్‌చంద్రశేఖర్, బి.ఎ.ఖాజా, వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరురఫీ, పసుపురవి, సుధాకర్, కాంట్రాక్టర్ సత్య తదితరులు పాల్గొన్నారు.

- నేడు మహిళా దినోత్సవం

మహిళలకు

నాడు.. అల్లంతదూరం | నేడు.. అందలం



మహిళలు ఇంటికే పరిమితమయ్యే రోజులకు కాలం చెల్లింది.
ప్రభుత్వ ఉద్యోగాలే కాదు.. ప్రజా ప్రతినిధులుగా ప్రజా సేవలో నడిచే రోజులొచ్చాయి.
గత టీడీపీ ప్రభుత్వం మహిళాభ్యున్నతికి మంగళం పాడితే..
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అగ్రభాగం ఇచ్చి అందలం ఎక్కించింది. ముందడుగు వేస్తున్నారు.

మదనపల్లె : మదనపల్లె నియోజకవర్గంలో మూడు మండలాలు. ఒక మున్సిపాలిటీ ఉంది. అందులో మదనపల్లె మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మనూజారెడ్డి, ఆమెతో పాటుగా మరో 17 మంది మహిళా కౌన్సిలర్లు, ఇద్దరు కోఆప్షన్ మెంబర్లు మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు.

ఎంపీపీలుగా..

నియోజకవర్గంలోని మూడు మండలాల్లో రెండు మండలాల్లో ఎంపీపీలుగా మహిళలే ఉండటం విశేషం. మదనపల్లె మండల ఎంపీపీగా రెడ్డెమ్మ, రామసముద్రం మండల ఎంపీపీగా కుసుమ కుమారి మండలాధిపతులుగా ఉన్నారు. నిమ్మనపల్లె మండలం జెడ్పీటీసీగా కే.ప్రమీలమ్మ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

సగభాగానికి మించి..

నియోజకవర్గంలోని రామసముద్రం మండలంలో 14 పంచాయతీలు ఉంటే.. అందులో 11 మంది సర్పంచ్‌లు, 8 మంది ఎంపీటీసీలు, నిమ్మనపల్లె మండలంలో 10 పంచాయతీలు ఉంటే.. 6మంది మహిళా సర్పంచ్‌లు, 5 మంది ఎంపీటీసీలు ఉన్నారు. మదనపల్లె మండలంలో 25 పంచాయతీలు ఉంటే...13 మంది మహిళా సర్పంచ్‌లు, 21 మంది ఎంపీటీసీలు ఉన్నారు.

మహిళలకు వైఎస్సార్‌సీపీ అందించిన లబ్ధి..

పథకం	లబ్ధిదారులు	రూ.కోట్లలో
అమ్మ ఒడి	33,908	143.79
వసతిదీవెన	20,208	22.94
విద్యాదీవెన	21,585	57.93
వైఎస్సార్ ఆసరా	46,096	152.68
ఇళ్లపట్టాలు	11,664	123.65
వైఎస్సార్ సున్నావడ్డీ	62.267	31.03

పీలేరులో..

పీలేరు : పీలేరు నియోజకవర్గంలో 6 మండలాలున్నాయి. ఆరు మండలాల్లో ఆరుగురు ఎంపీపీలు, ఐదుగురు జెడ్పీటీసీలు మహిళలే ఉండడం విశేషం. కేవీపల్లె ఎంపీపీగా ఈశ్వరమ్మ, జెడ్పీటీసీగా గజ్జెల శృతి, కలికిరి ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీగా పద్మజ, కలకడ, ఎంపీపీగా శ్రీదేవి, జెడ్పీటీసీగా హారిక, గుర్రంకొండ ఎంపీపీగా సీతమ్మ, జెడ్పీటీసీగా తస్రీమ్, వాల్మీకిపురం ఎంపీపీగా అరుణమ్మ, జెడ్పీటీసీగా నిర్మల, పీలేరు వైస్ ఎంపీపీగా హరిత ప్రజలకు సేవలందిస్తున్నారు.

సగభాగానికి మించి..

అలాగే కేవీపల్లె మండలంలో 10 మంది సర్పంచ్‌లు, ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు, కలకడ మండలంలో ఐదుగురు సర్పంచ్‌లు, కలికిరిలో ఆరుగురు సర్పంచ్‌లు, గుర్రంకొండ 10 మంది సర్పంచ్‌లు, పీలేరులో 10 మంది సర్పంచ్‌లు, 12 మంది ఎంపీటీసీలు, వాల్మీకిపురం 8 మంది సర్పంచ్‌లు, ఏడుగురు ఎంపీటీసీ సభ్యులుగా మహిళలు ఉన్నారు.

మహిళలకు వైఎస్సార్‌సీపీ అందించిన లబ్ధి..

పథకం	లబ్ధిదారులు	రూ.కోట్లలో
వైఎస్సార్ చేయూత	18,541	82.47
వైఎస్సార్ ఆసరా	42,296	149.89
అమ్మ ఒడి	25,329	37.99
విద్యాదీవెన	15,963	42.24
వసతిదీవెన	8,079	10.14
వైఎస్సార్ సున్నావడ్డీ	42,98	17.48
ఇళ్ల పట్టాలు	20,000	

తంబళ్లపల్లెలో..

ఎంపీపీలుగా..

తంబళ్లపల్లె నియోజకవర్గంలో నియోజకవర్గంలో 6 మండలాల్లో మూడు మండలాలకు ఎంపీపీలుగా మహిళలే ఉండడం విశేషం. లక్ష్మనరసమ్మ బి.కొత్తకోట ఎంపీపీగా, సాయిలీలా ములకలచెరువు ఎంపీపీగా, పూర్ణ చంద్రిక పెద్దమండ్యం ఎంపీపీగా, తంబళ్లపల్లె ఎంపీపీగా అనసూయమ్మ ఎన్నికయ్యారు. అలాగే పెద్దమండ్యం జెడ్పీటీసీగా పీరమ్మ, కురబలకోట జెడ్పీటీసీగా బైసాని జ్యోతి, తంబళ్లపల్లె జెడ్పీటీసీగా గీత వ్యవహరిస్తున్నారు.

సగభాగానికి మించి..

నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 102 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించగా.. అందులో 53 సర్పంచ్ పదవులు మహిళలకే దక్కాయి. అంటే సగానికి మించి పదవుల్లో కొలువయ్యారు. ఎంపీటీసీ స్థానాలు 78 ఉండగా.. అందులో సగం 39 స్థానాల్లో మహిళలకే పట్టంకట్టారు. ఇక ఎంపీటీసీలుగా, వార్డు సభ్యులుగా మహిళలు సేవలందిస్తున్నారు.

మహిళలకు వైఎస్సార్‌సీపీ అందించిన లబ్ధి..

పథకం	లబ్ధిదారులు	రూ.కోట్లలో
వైయస్సార్ సున్నా వడ్డీ	59,560	49.70
వైయస్సార్ ఆసరా	47,310	170.36
వైఎస్సార్ చేయూత	10,913	82.02
అమ్మఒడి	20,240	30.36
ఇళ్ల పట్టాలు	20,000	

విద్యార్థుల బంగారు భవిష్యత్తే జగనన్న లక్ష్యం

పీలేరు : పేద విద్యా ర్థుల బంగారు భవిష్యత్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని పీలేరు, కేవీపల్లె మండలాల పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంఎం కల్యాణ మండపంలో విద్యార్థి యువజన విభాగాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి రూ.73 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.

ప్రజల గుండెల్లో జగనన్న

వాల్మీకిపురం : పార్టీలకతీతంగా ప్రజలందరికీ పథకాలందించిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తనయుడు చింతల సాయికృష్ణారెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని బండమకాన్‌వీధి, జెట్టిపాల్యెంవీధిలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమం కోరుతూ పథకాలను అమలు చేస్తున్నారని, గతంలో టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల ద్వారా కేవలం ఆ పార్టీ నాయకులే దోచుకుని పంచుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ప్రజలందరికీ అర్హతే ప్రామాణికంగా అందజేస్తున్నామని చెప్పారు.

శంభో శంకరా..

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : మహాశివరాత్రి పురస్కరించుకుని శుక్రవారం శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి నిమ్మనపల్లె మండలం కలకడ మండలం ఝరికోనకు ఉదయం 10 గంటల నుంచి 10 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. మదనపల్లె నుంచి తంబళ్లపల్లె మల్లయ్యకొండకు 18 బస్సులు, బి.కొత్తకోట నుంచి మల్లయ్యకొండకు రెండు బస్సులు, పెద్దమండ్యం నుంచి మల్లయ్యకొండ కిందకు రెండు బస్సులు, ములకలచెరువు నుంచి మల్లయ్యకొండకు రెండు బస్సులు, తంబళ్లపల్లె రాగిమాను నుంచి మల్లయ్యకొండకు 8 బస్సులు, మల్లయ్యకొండకు కిందకు 40 బస్సులు నడపనున్నట్లు తెలిపారు.

శివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం

కురబలకోట : కురబలకోట మండలంలోని అంగళ్లు సమీపంలోని మల్లయ్య కొండ శివరాత్రి వేడుకలకు సిద్ధమైంది. శుక్రవారం ఉదయం రుద్రాభిషేకం, మహా మంగళహారతి, సాయంత్రం మౌనికతో భరత నాట్యం, కూచిపూడి నాట్యం జరుగుతుంది. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవం, రథోత్సవం , భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. శనివారం ఉదయం కర్పూర హారతి, రోజంతా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూరి తెలిపారు.

భక్తులతో కిక్కిరిసిన మల్లయ్యకొండ

తంబళ్లపల్లె : మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా మల్లయ్యకొండ శివమాల భక్తులతో గురువారం కిక్కిరిసింది. శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. శివమాలదారులు ఇరుముడితో మల్లయ్యకొండకు చేరుకున్నారు. మల్లికార్జునలు స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ మల్లిరెడ్డి, ఈఓ రమణ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

నేడు వీరన్న కొండపై తిరుణాల

వాల్మీకిపురం : మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం స్థానిక వీరన్నకొండపై తిరుణాలను ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే చింతపర్తి ఓబులేశ్వర స్వామి కొండపై శివరాత్రిని పురస్కరించుకొని స్వామివారికి అభిషేకాలు, హోమాలు నిర్వహించనున్నారు.

వరప్రదాత మద్దుండాల మల్లేశ్వరుడు

పీలేరు రూరల్ : మండలంలోని తలపుల పంచాయతీ అడవిపల్లె సమీపంలో వెలసిన శ్రీ మద్దుండాల మల్లేశ్వరస్వామి భక్తుల వరప్రదాతగా ప్రసిద్ధి చెందారు. ప్రతి ఏటా ఇక్కడ మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధం

అడవిపల్లె సమీపంలో మద్దుండాల మల్లేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎంపీటీసీ వెంకటరమణనాయుడు మాట్లాడుతూ నేడు శుక్రవారం ఉదయం స్వామివారికి అభిషేకం, అలంకరణ, పూజా కార్యక్రమాలు, సాయంత్రం పార్వతీపరమేశ్వరుల ఊరేగింపు, రాత్రి జాగారం, అన్నమాచార్య ప్రాజెక్టు వారిచే రాత్రి హరికథా కాలక్షేపం ఉంటుందని చెప్పారు. 9న శనివారం ఝరిస్నానాలు, సిద్ధపూజ, మొక్కుబడులు, భజనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

శివరాత్రి వేడుకలకు సర్వంసిద్ధం

రామసముద్రం : రామసముద్రం మండలంలో మహాశివరాత్రి సందర్భంగా పలు శివాలయాలు ముస్తాబయ్యాయి. ఆర్.నడింపల్లి పంచాయతీ బల్లసముద్రం వద్ద కొలువైన వాలీశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. శివరాత్రి వేడుకలను ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తారు. అలాగే మూగవాడిలోని శ్రీపురందేశ్వరి స్వామి, గుంతయంబాడిలోని శ్రీపుండీశ్వర స్వామి, రామసముద్రంలోని శ్రీవాలీశ్వరస్వామి తదితర ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం రుద్రాభిషేకం మహామంగళహారతి నిర్వహిస్తారు.

పూలకొండలో అభివృద్ధి పనులు

కలికిరి : మండలంలోని గుట్టపాళెం గ్రామంలో వెలసిన పూలకొండ మల్లికార్జున స్వామి ఆలయ ఆవరణలో స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపట్టారు. ఈ క్రమంలో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ఆలయ ధర్మకర్తతో పాటు స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో ఆలయం చుట్టూ సిమెంటు ఫ్లాట్‌ఫామ్ ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఇబ్బంది లేకుండా వాహనాలు, భక్తుల రాకపోకలకు దారి సౌకర్యం కల్పించినట్లు సర్పంచ్ పేర్కొన్నారు.

భక్తుల ఇలవేల్పు సిద్ధేశ్వరుడు

కలకడ : భక్తుల ఇలవేల్పుగా శ్రీ కామాక్షిసమేత సిద్ధేశ్వరస్వామి ప్రసిద్ధి. 13వ శతాబ్దంలో వైడుంబరాజులు ఈ ఆలయాన్ని నిర్మించారని చెబుతుంటారు. ఆలయ నిర్మాణానికి ఒక ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. కల్లుకుండలో శివలింగం ఉద్భవించడంతో కల్లుగట, కలకట, పేరు కాలక్రమేన రూపాంతరం చెంది కలకడగా పిలుస్తున్నారు. ప్రతి ఏడాది శివరాత్రి రోజు ఉత్సవాలు నిర్వహించి స్వామివారికి వాహన సేవలు నిర్వహిస్తారు.

కన్నుల పండువగా సిద్ధేశ్వరస్వామి కల్యాణం

కలకడ : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీకామాక్షి–సిద్ధేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవం గురువారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవాలకు భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

వైభవంగా కలశ ప్రతిష్ట

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టీ సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లి సమీపంలో వెలసిన శ్రీ ప్రసన్న పార్వతీ సమేత సంఘమేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ నేపథ్యంలో గురువారం ఆలయంలో అంకురార్పణ, ధ్వజావరోహణం, కలశ స్థాపన కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

మహిళలకు సమాన అవకాశాలు

బి.కొత్తకోట : మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని తహసీల్దార్ పుణ్యవతి అన్నారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మహిళలు సమస్యలను ఎదుర్కొని వారు ఎంచుకున్న రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. మహిళల భద్రతకు అమలవుతున్న చట్టాలు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న సాధికార కార్యక్రమాల గురించి వివరించారు. అన్ని అవరోధాలను దాటుకుని ఎదగడం ద్వారానే మహిళలకు గుర్తింపు దక్కుతుందన్నారు. సీడీపీఓ భాగ్యమ్మ మాట్లాడుతూ లింగ వివక్ష, వరకట్న వేధింపులు, బాల్య వివాహాలు, గృహహింసను మనోధైర్యంతో అధిగమించాలని సూచించారు.

ఘనంగా మహిళా దినోత్సవం

మదనపల్లె సిటీ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అధ్యాపకులు, విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీనిధి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళా అధ్యాపకులకు సన్మానం

వాల్మీకిపురం : శుక్రవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మహిళా అధ్యాప, అధ్యాపకేతర బృందాన్ని సన్మానించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ పెద్దప్పరాజు ఆధ్వర్యంలో మహిళా అధ్యాప, అధ్యాపకేతర బృందానికి పసుపు, కుంకుమ, వస్త్రం అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నారాయణ స్వామి, విజయలక్ష్మి, నిర్మల, జ్యోతి, సబీనా, రజిని, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.